www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 12 డిసెంబర్ 2024

5

తిరుపతి



నజీర్ ఖాన్‌కు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఉత్తరప్రదేశ్ లక్నోలో ప్రపంచ మానవ హక్కుల 76వ వార్షికోత్సవం ఘనంగా జరి గింది. ఈ సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నజీరాఖాన్‌కు ఆసంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.అన్సారీ జీవితసాఫల్య పురస్కారం అవార్డును అందజేశారు. గతంలో ఆయన తిరుపతి రైల్వే స్టేషన్లో ఐఆర్ సీటీసీ ఏరియా ఆఫీసర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా నజీర్ ఖాన్ మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడటం కోసం తన వంతు కషి చేస్తానని చెప్పారు. ఈ పురస్కారం రావడం పట్ల మరింత బాధ్యత తనపై పెరిగిందని గుర్తు చేశారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని ... పునర్నిర్మించే వరకూ... పునరంకితం

గురువులకు రూ.10వేలు గౌరవవేతనం ఇవ్వాలి
అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి
టిటిడి పరిపాలనా భవనం వరకూ కళాకారుల శోభాయాత్ర



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే, చండాలుడుండేటి సరిభూమియొకటే' అని అన్నమయ్య సమాజంలో పాతుకుపోయిన కులవివక్షను నిరసించారని, అటువంటి మహనీయుని ఇంటిని తిరుమలలో పునర్నిర్మించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం తిరుపతి సమీపంలోని బిటిఆర్ కాలనీ వద్ద ఉన్న అన్నమయ్య కళాక్షేత్రం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనం వరకూ రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ 'శోభాయాత్ర'గా చేరుకున్నారు. బిటిఆర్ కాలనీ 12వ లైన్‌లో అన్నమయ్య కళాక్షేత్రం వద్ద పునరంకిత ఉత్సవాన్ని తొలుత నిర్వహించారు. శోభాయాత్ర బిటిఆర్ కాలనీ, తిమ్మినాయుడుపాళెం, లీలామహల్ సెంటర్ మీదుగా టిటిడి పరిపాలనా భవనం వరకూ సాగింది. విజయ శంకర స్వామి మాట్లాడుతూ ఏడుకొండల స్వామి భక్తుడైన అన్నమయ్య గృహాన్ని, హనుమంతుని విగ్రహాలను 2007లో కూల్చేశారన్నారు. తిరుమలలో అన్నమయ్య ఇంటితో పాటు, హనుమంతుని విగ్రహాన్ని ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జయభారత్ సంస్థలు సంయుక్తంగా అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలని కోరుతూ దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణా, ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 11 లక్షల 50వేల మంది భక్తుల నుంచి సంతకాలను సేకరించి టిటిడి ఈవో, ఛైర్మన్‌కు సమర్పించామన్నారు. తిరుమల కొండపై ఏడాదికి 3,600 బృందాలు హరినామ సంకీర్తన నిర్వహిస్తుండగా, మరో ఏడువేల బృందాలు టిటిడి వద్ద నమోదు చేసుకున్నాయన్నారు. వీరందరికీ తిరుమల దక్షిణ మాడా వీధిలో నిర్వహిస్తున్న తరహాలోనే తిరుమలలోని కొన్ని ప్రదేశాలతోపాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, గోవిందరాజస్వామి, కపిలతీర్థం, కోదండరామాలయం, శ్రీనివాస మంగాపురం, కార్వేటినగరం ఆలయం, అప్పలాయగుంట ఆలయాల్లో, టిటిడి అనుబంధ ఆలయాల్లో హరినామ సంకీర్తనలకు అవకాశం ఇవ్వాలన్నారు. గ్రామీణ కళాకారులు నిర్వహించుకునే కోలాటం, చెక్కభజన కళారూపాలు, ప్రాచీన సంప్రదాయ కళలైన కూచిపూడి, భరతనాట్యం కళారూపాలకు వేదిక ఏర్పాటు చేసి, వసతి, భోజనంతో పాటు, ప్రయాణ ఛార్జీలను టిటిడి చెల్లించాలని డిమాండ్ చేశారు. సాంప్రదాయ కళారూపాలు తరిగిపోకుండా గురువులకు టిటిడి నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పాలకమండలి దృష్టికి పై సమస్యలు తీసుకెళ్లామన్నారు. అయితే పట్టించుకోలేదన్నారు. నూతన పాలకమండలి అయినా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే జనవరి 22వ తేదీన ఆహారం మానేసి హరినామ సంకీర్తనలతో పెద్దఎత్తున భక్తి నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం టిటిడి జెఇఒ వీరబ్రహ్మంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ నాయకులు గంగులప్ప, చంద్రశేఖర్ భాగవతార్, సంక్రాంతి వెంకటయ్య, జానపద వృత్తి కళాకారుల సంఘం నాయకులు బంగారు మురళి, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పరశురాం, అన్నమయ్య జిల్లా రాయచోటి వీరభద్రస్వామి దేవస్థానం తుమ్మల హరినాథ్, నంద్యాల జిల్లా టి.శివరామిరెడ్డి, చిత్తూరు జిల్లా సునీత, కడప జిల్లా బ్రహ్మానందరెడ్డి, అనకాపల్లి బోయినలక్ష్మి, కాకినాడ జిల్లా అప్పలనాయుడు, నంద్యాల జిల్లా నుంచి భజన కృష్ణయ్య పాల్గొన్నారు.

తెలుగుగంగ లీకేజీల ఇక్కట్లు — 'గంగ' పొంగెను 'గుంత' తేలెను

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగర ప్రజల దాహార్తి తీర్చే తెలుగుగంగ పైపుల లీకేజీల కారణంగా మంగళంలో కొన్ని కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారాలుగా తెలుగు గంగ పైపుల నుండి లీకేజీల కారణంగా తిరుపతి–కరకంబాడీ మార్గంలోని మంగళం డిపో మార్గంలో, బొమ్మల క్వార్టర్స్ వద్ద పెద్ద సంఖ్యలో తెలుగుగంగ నీరు వృథాగా కాలువలోకి వెళ్తోంది. గతంలో ఇదే కరకంబాడీ మార్గంలోని మంగళం క్వార్టర్స్ ప్రధాన మార్గంలో లీకేజీ కారణంగా సమీపంలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరకంబాడీ ప్రధాన మార్గం నుండి తిరుమల నగర్‌కు వెళ్లే అంతర్ రోడ్డు మార్గం గుండా తెలుగు గంగ నీరు పైనున్న పంపింగ్ కేంద్రానికి చేరుతుంది. ఇదే మార్గంలో తిరుపతి నగరానికి సరఫరా అయ్యే పైపులైను ఉంది. ఈ మార్గంలో ఏర్పడిన లీకేజీలకు తెలుగు గంగ అధికారులు తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేశారు. దీని ఫలితంగా నేటికీ గంగ కాలువ పాలు అవుతోంది. ఇదే విధంగా క్రిష్ణవేణి యాదవ కాలనీ వద్ద నెలలుగా తెలుగుగంగ నీరు లీకేజి అవుతోంది. దీని కారణంగా దాదాపుగా 50 నుంచి 60 మీటర్ల వరకు రోడ్డు గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది.

ఎవ్వరూ స్పందించకపోవడంతో.....

తెలుగు గంగ లీకేజీల కారణంగా తిరుమలనగర్ మార్గం నుండి బీటిఆర్ కాలనీకి వెళ్లే జంక్షన్‌లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు గమనించని చాలా మంది వాహనదారులు చిన్నపిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లే సమయంలో ప్రమాదాలకు గురౌతున్నారు. దీనిని గమనించిన సమీప టీ దుకాణ నిర్వాహకులు, ఆటోడ్రైవర్ సమీపంలో ఉన్న రాళ్లను, మట్టిని తీసుకొచ్చి గంగ లీకేజి కారణంగా ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఇకనైన తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేసి వృధా అవుతున్న తెలుగు గంగ నీటిని సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

గుంతలు మట్టితో పూడ్చుతున్న స్థానికులు.

ముక్కంటి...నువ్వే సాక్షి..!

అడ్డదారిలో 38 మందికి దర్శనం
అంతుచూస్తానంటూ బెదిరింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయాధికారుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. వారు తీసుకునే నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు భక్తుల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగడుతున్నాయి. అయిన వారికి ఆకుల్లో..కాని వారికి కంచాల్లో అన్న చందాన వ్యవహరిస్తున్నారన్నా విమర్శలూ ఉన్నాయి. దీన్ని నిజం చేస్తూ జరిగిన ఓ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో హవా కొనసాగించిన ఒక జాతీయ పార్టీ నాయకుడికి అనుచరుడుగా చెలామణి అవుతున్న వ్యక్తి కూటమి ప్రభుత్వంలోనూ అదేవిధంగా వ్యవహరిస్తున్నాడు. సోమవారం ఉదయం 38 మంది భక్తులతో (టికెట్లు లేకుండా) ఆలయానికి వచ్చిన ఆ వ్యక్తి ప్రత్యేకమైన క్యూ లైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించాడు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా వాదన జరిగింది. అయితే బంగారు ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న పెద్ద గేటును తోసుకుని ఆలయంలోకి వెళ్ళిపోయాడు. ఈ సందర్భంగా ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, హోమ్ గార్డులు అభ్యంతరం చెప్పినా ఏ మాత్రం లెక్క చేయలేదు. 38 మందితో ఆలయం లోకి వెళ్లి స్వామి అమ్మవార్ల దర్శనం చేయించి తిరిగి దర్జాగా వెళ్లిపోయాడు. ఈ సంఘటన గురించి సిబ్బంది అధికారులందరికీ సమాచారం ఇచ్చారు. అయితే అధికారులు ఏమాత్రం చలించలేదు. పైగా గేటు తెరవకుండా అభ్యంతరం చెప్పిన వారి అంతు చూస్తా అంటూ బెదిరించడం కొసమెరుపు. తానెవరో తెలిసి కూడా అభ్యంతరం చెప్పడం, గేటు తీయక పోవడం అవమానంగా ఉందని అందర్నీ గుర్తు పెట్టుకుని పని పడతానంటూ బెదిరించి వెళ్ళాడు. బలవంతంగా గేటు తోసుకుని వెళ్ళడమే కాకుండా అంతు చూస్తానంటూ బెదిరించడంపై సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డ్ అయినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

వేడుకగా ఏడు గంగమ్మల జాతర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర పండుగగా ఏడుగంగమ్మల జాతరను శ్రీకాళహస్తిలో బుధవారం వేడుకగా నిర్వహించారు. ఏడు ప్రాంతాల్లో ఏడు గంగమ్మలను ప్రతిష్టించారు. భక్తులు పెద్ద ఎత్తున గంగమ్మలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెళ్లి మండపం వద్ద ప్రతిష్టించిన ఏడు గంగమ్మలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుతలు కూడా ఏడు గంగమ్మలను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేటి నుంచి ఎస్‌డబ్ల్యుఎఫ్ రిలేదీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు డిపో పరిధిలో కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం బుధవారానికి ఏడో రోజుకు చేరుకుంది. డిపో కార్యదర్శి డి.శ్రీధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. డిపో సహాయ కార్యదర్శి కెవిఎస్ వాసు మాట్లాడుతూ యాజమాన్యం స్పందించి అక్రమ సస్పెన్షన్ రద్దు చేయకుంటే గురువారం నుంచి రిలే నిరశన దీక్ష చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు బివి రమణయ్య, ఎస్.సురేష్ మాట్లాడుతూ ఉద్యోగులను అక్రమంగా సస్పెండ్ చేసిన డిపో మేనేజర్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ చేస్తున్న ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వారం రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సర్క్యులర్ 1/2019 అమలు చేయాలని కోరారు. నాయకులు ఎస్ఎస్‌వి కృష్ణా, కిరణ్, రఘురాం, కత్తి సుబ్రమణ్యం, రుక్మిణమ్మ, ఎ.శీనయ్య, జివి రమణయ్య, పిఆర్ రాజు పాల్గొన్నారు.

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన

బాడుగిళ్లపై... 'పవర్' బాదుడు..!





ఓ పక్క ఉండేందుకు జానెడు స్థలం లేక, సొంతిల్లు లేక 'అద్దె' ఇళ్లలో ఉండేవారికి 'సర్దుబాటు' పేరుతో డిస్కంలు వేస్తున్న భారం అసహనానికి గురిచేస్తుంది. ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంచలేదంటూనే 'సర్దుబాటు' పేరుతో నెలనెలా వాత పెడుతున్నారు. గత ప్రభుత్వం 'చంద్రబాబు' పాపం అని పెంచితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'జగన్ పాపం' అంటూ వాయిస్తున్నారు. వాస్తవం ఏమంటే వినియోగదారులకు నెలనెలా భారం తప్పడం లేదు. ఈ నెల డిసెంబర్ బిల్లులను పరిశీలిస్తే గతంలో ఎప్పుడో వాడిని కరెంట్‌కు ఇపుడు సర్దుబాటు ఛార్జీలను వేస్తున్నారు. అయితే బాడుగిళ్లలో ఉండేవారు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బాడుగ ఉండేవాళ్లు వాడితే తాము ఎందుకు చెల్లించాలంటూ మండిపడుతున్నారు. కూలీనాలీ చేసుకుని బతుకుతున్న తాము గతంలో ఎవరో ఏసీలకు వాడిన బిల్లు కట్టమంటే ఎలా కట్టగలమని వాపోతున్నారు.

- ట్రూఅప్ పెంపుపై లబోదిబో
- కట్టితీరాలంటున్న 'ఓనర్లు'

ప్రజాశక్తి - కోట

కోట మండలంలో విద్యుత్ బిల్లులను 'ప్రజాశక్తి' పరిశీలించగా బాడుగ ఇళ్లలో ఉండేవారు విద్యుత్ అదనపు ఛార్జీలపై మండి పడుతున్నారు. 2024 డిసెంబర్ నెలలో కరెంట్ బిల్లులకు తోడు ఫిక్స్‌డ్, కష్టమర్, ట్రూఅప్ ఛార్జీలను వేస్తూ 2022, ఏప్రిల్‌లో వినియోగించిన వస్తువులకు 1.22 పైసలు ప్రతి యూనిట్‌కు అదనంగా వేస్తుండటం కనిపించింది. 2022 ఏప్రిల్ నుంచి 2023, మార్చి వరకూ వినియోగదారులు వినియోగించుకున్న వస్తువులకు దశలవారీగా అదనపు రుసుమును విధిస్తున్నారు. గత ఐదారేళ్లుగా ఒకే ఇంట్లో బాడుగ ఉంటే పర్వాలేదు. అయితే తాజాగా ఆ ఇళ్లల్లోకి వచ్చిన వారు మాత్రం గతంలో వారు వాడిన బిల్లులను తాము కట్టేదేంటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏసీ ఉండేవారి బిల్లులను, కూలీనాలీ చేసుకునే వారు కట్టాలంటే ఎలా అన్నది వారి వాదన. అద్దెకు ఇచ్చిన వారు మాత్రం తమకేమీ తెలియదని, మీరు వాడిన బిల్లులు మీరే చెల్లించాలని దాట వేస్తుండటం గమనార్హం. ఓ సాధారణ కుటుంబంలో బిల్లు పరిశీలించగా కరెంట్ యూనిట్లకు 700 రూపాయలు, అదనంగా 2022లో ఉండేది 400 కలిపి రూ.1100 వరకూ కరెంట్ బిల్లు వచ్చింది. ఇది ప్రస్తుతం బాడుగ ఉండేవారు కట్టి తీరాల్సిందే.

గతంలో ఓ కంప్యూటర్ సెంటర్‌కు ఓ షాపును బాడుగకు ఇచ్చారు. దానిలో రెండు ఏసీలు, కంప్యూటర్ సిస్టం ఉండేది. విద్యుత్ లోడ్ అదనంగా వాడేవారు. ప్రస్తుతం వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ షాపులో చిన్న టిఫిన్ అంగడిపెట్టుకున్నారు. వాళ్లకు నెలనెలా వచ్చే బిల్లుకాకుండా అదనంగా 800 రూపాయలు బిల్లు వస్తుంది. ఇలా ఎప్పుడంటే అప్పుడు, ఇష్టం వచ్చినట్లుగా ప్రజలమీద భారాలు మోపడం ఏంటని బాడుగిళ్లలో నివాసం ఉండేవారు వాపోతున్నారు.

అదనపు ఛార్జీలు దారుణం : కనుపూను మురళీకృష్ణ, వ్యాపారవేత్త, విద్యానగర్, చెందోడు, కోట మండలం

ఫిక్స్‌డ్, కష్టమర్, ట్రూఅప్ ఛార్జీలంటూ విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపడం దారుణం. ఇకపై ఇలాంటి అదనపు ఛార్జీల భారం లేకుండా ప్రస్తుతం వాడిన కరెంట్‌కే బిల్లులు ఉండేలా చూడాలి. గతంలో వాడిన తీరును బట్టి ఇప్పుడు కట్టాలంటూ అదనపు ఛార్జీలు వేయడం సరికాదు.

వాడిన యూనిట్లకే బిల్లు ఉండాలి : మద్దాలి సురేష్‌రెడ్డి, ఎంఎస్ఆర్ టైల్స్ ప్లాజా, విద్యానగర్, కోట మండలం

విద్యుత్ బిల్లు అదనపు ఛార్జీలు లేకుండా చూడాలి. వాడిన కరెంట్ యూనిట్ల కంటే అదనపు ఛార్జీల పేరుతో ప్రతి బిల్లుపై 200–500 రూపాయలు కట్టాల్సి వస్తోంది.

శ్రీరంగం ఆలయానికి టిటిడి పట్టువస్త్రాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తమిళనాడు శ్రీరంగంలోని ప్రముఖ శ్రీ వైష్ణవ క్షేత్రం శ్రీ రంగనాథ స్వామికి టీటీడీ ఈవో జె శ్యామలరావు బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. టిటిడి ఈవోకు శ్రీ రంగం ఆలయ జాయింట్ కమిషనర్ మరియప్పన్ స్వాగతం పలికారు. టిటిడి తిరుమల ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

రేపు శ్రీ తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో 13వ తేదీ శ్రీ తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర జరగనుంది. ఈ ఆలయంలో డిసెంబరు 4 నుండి శ్రీ తిరుమంగై ఆళ్వార్ ఉత్సవం జరుగుతోంది. సాత్తుమొర సందర్భంగా డిసెంబరు 13న సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు, శ్రీ తిరుమంగై ఆళ్వార్ ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.

ఎస్‌జిఎస్‌లో గీతాజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. సంస్కృతం అధ్యాపకులు డాక్టర్ కె.కోటేశ్వరయ్య శ్లోకాలను చూడకుండా చెప్పిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డా. ఎం మాదన్న, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. పరమేశ్వర , తెలుగు అధ్యాపకులు డా.జె. కొండలరావు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ఇస్కాన్ దేవాలయ సంచాలకులు లీలా పారాయణదాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. భగవద్గీత సకల శాస్త్రాల సమాహారమని అన్నారు. అధ్యాపకులు డా. కె.వేంకట రమణమ్మ, డా. వి. ప్రసన్న లక్ష్మీ, కె. యమున ఆధ్వర్యంలో విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పారాయణం చేసి ఆకట్టుకున్నారు.

మహిళల హక్కులు మానవ హక్కులే

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మహిళా హక్కులు మానవహక్కులని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ముందు మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని మహిళల హక్కులను మానవ హక్కులుగా పరిగణించాలని కోరుతూ నిరసన చేపట్టారు. పి. సాయి లక్ష్మీ మాట్లాడుతూ మహిళలను రెండవ తరగతి పౌరులుగా పరిగణిస్తూ వారి హక్కులను కాల రాస్తున్నారని, ఈ కారణంగానే మహిళలపై హింస విపరీతంగా పెరిగిపోతుందనానరు. ప్రతి పదిహేను నిమిషాలకు ఒక మహిళ పైన అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి హేమలత, జిల్లా నాయకురాలు పౌర్ణమి, సిఐటియు జిల్లా కార్యదర్శి జయ చంద్ర, జిల్లా నాయకులు చిన్నబాబు, వర లక్ష్మి , నాగరత్నమ్మ పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటిలో హ్యాకథాన్-2024

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఎదురవుతున్న సవాళ్ళను పరిష్కరించే దిశగా ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక తిరుపతి ఐఐటీలో బుధవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 52 నోడల్ కేంద్రాల నుంచి 1300 మంది విద్యార్థులు హ్యాకథాన్ లో పాల్గొన్నారు. దేశం అనేక రంగాల్లో సమస్యలను ఎదుర్కొంటుందనీ, ఆ సమస్యలను అధిగమించేలా విద్యార్థులు తమ పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ఐఐటీ విద్యార్థులతో నూతన ఆవిష్కరణలపై ముచ్చటించారు. తిరుపతి ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ రేణు దీక్షిత్ పాల్గొన్నారు.

'ఉద్యమ్' ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో జరుగుతున్న చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఆన్లైన్ నమోదు ప్రక్రియను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం బాలాజి కాలని, టౌన్ క్లబ్ తదితర ప్రాంతాల్లో సచివాలయం కార్యదర్శులు నిర్వహిస్తున్న ఈ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఉద్యమ్" అనే పోర్టల్ ద్వారా చిన్న, మధ్య తరగతి పరిశ్రమల నిర్వాహకులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ఉద్యమ్ పోర్టల్ నందు వివరాలను నమోదు చేసుకోవడం వలన వివిధ చిన్న, మధ్య తరగతి ప్రభుత్వ పథకాలు, రాయితీలు సులభంగా పొందవచ్చు అన్నారు. కమిషనర్ వెంట డిఈ మధు బాబు, సచివాలయం కార్యదర్శులు సురేష్, లోకేష్ ఉన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో ఓ ప్రైవేట్ లేఅవుట్ వద్ద రోడ్డు ఆక్రమణను బుధవారం శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు తొలగించారు. శ్రీకాళహస్తి–పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గం పక్కన ఓ వైసీపీ నేతకు ప్రైవేట్ లే- అవుట్ ఉంది. గత ప్రభుత్వంలో ఆయన శ్రీకాళహస్తి–పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గం నుండి లే–అవుట్ ను కలుపుతూ రోడ్డు–కాలువ పోరంబోకు స్థలంలో రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇది అక్రమం అంటూ మున్సిపల్ అధికారులు జేసీబీ సాయంతో లే–అవుట్ రోడ్డును తొలగించేశారు. అయితే సదరు స్థలంలో రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి ఉందనీ, న్యాయపోరాటం చేస్తానని వైసీపీ నేత అంటుండటం గమనార్హం.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి: ఎంపిపి

అస్తవ్యస్తమైన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిపి ధనలక్ష్మి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయ ముఖద్వారం వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలని నాయుడుపేట ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి పేర్కొన్నారు. ఎంపిడివో కె సురేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, సిబ్బందితో కలిసి ఎంపీడీవో కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అస్తవ్యస్తం రోడ్డును ఆమె బుధవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం ముఖద్వారం వద్ద భారీ గుంతలు ఏర్పడి, వర్షపు నీటితో బురదమయంగా వుండడంతో ఎంపీడీవో కార్యాలయానికి సమస్యల పరిష్కా రం కోసం వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఈ ప్రధాన ద్వారం వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

పెళ్లి పీటలు వితరణ

బలిజ సంఘ భవనానికి పెళ్లిపీటలు ఇచ్చిన సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక బలిజ సంఘం భవనానికి పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం గోపి రాయల్, వారి కుటుంబ సభ్యులు కలసి భవనానికి పదివేల రూపాయలు విలువ కలిగిన ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న శ్రీహర్ష సైన్యం సభ్యులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని చిన్న రామాపురం పంచాయతీ మూల పల్లి ఎస్టి కాలనీకి చెందిన వి కనకమ్మ.(74) మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసు కున్న టిడిపి నాయకులు శ్రీహర్ష యువ సైన్యం సభ్యులు మృతురాలి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలను కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. భౌతిక దేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పి మునిశేఖర్, ఎన్ గంగాధరం, ఎస్ఆర్ మూర్తి, ఎం రాజశేఖర్, కె మునికృష్ణ , టి నాగరాజు, డి ఎర్రయ్య , ఆర్ హనుమంతు, ఎం శంకర్, బిఎం రత్నం , ఎం కృష్ణమూర్తి, బి చిన్నరాయుడు , బి పవన్, టి అనిల్ , పి సంగీత పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కు ఘన సన్మానం

గుంట లక్ష్మణ్‌ని సన్మానిస్తున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల తిరుపతి పర్యటనకు విచ్చేసిన ఏబిఆర్ఎస్ఎం న్యూఢిల్లీ ఆల్ ఇండియా జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంట లక్ష్మణ్‌ని ఆంధ్రప్రదేశ్ శాఖ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి డాక్టర్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం జువాలజీ డిపార్టుమెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ చంద్రశేఖరన్

పౌష్టికాహారంపై పరిశోధనా సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చిన్నపిల్లల విభాగం రుయా ఆసుపత్రి , ఎస్ వి వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు పరిశోధన, అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ పీవి చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు పోషక ఆహారంలో మన చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఉన్న మేలైన ఆహార చిరుధాన్యాలను తీసుకొని వాటిని పోషక విలువలు కలిగిన చిన్నపిల్లలకు ఆహారాన్ని అందించవచ్చునని తెలిపారు. ఈ సదస్సులో సూక్ష్మ , స్థూల పోషకాల లోపం కలిగిన ఐదు సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులకు, సదస్సు ముఖ్య ఉద్దేశ్యం ప్రధాన పరిశోధకులు డాక్టర్ చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ ఎవస్ కీర్తి, డాక్టర్ సి సునీత (ఆహార నిపుణురాలు ఎన్ఆర్సి) , డాక్టర్ పి మధుసూదన్ (ఎంఆర్‌యు పరిశోధన శాస్త్రవేత్త) వివరించారు. డాక్టర్ పి మనోహర్ (చిన్న పిల్లల విభాగాధిపతి పోషకాహారాలు కూడిన స్నాక్ బార్‌ను పోషకాహార లోపం పిల్లలకు వారి తల్లిదండ్రులకు అందజేస్తూ ఈ పరిశోధన మూడు నెలలపాటు కొనసాగుతుందని, ఈ పరిశోధన సమయంలో ఉచితంగా పిల్లలకు ఆహార పదార్థాలు ఈ కేంద్రం నుండి ఇస్తారని తెలిపారు. ఈ పరిశోధన మూడు నెలల తర్వాత విశ్లేషించి ఫలితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ పరిశోధనలో అర్హులైన పిల్లలు అందరూ పాల్గొని ఈ పరిశోధనని జయప్రదం చేయాలని కోరినారు. ఈ సదస్సులో చిన్న పిల్లల తల్లిదండ్రులు, డాక్టర్ రాజశేఖర్ (చిన్న పిల్లల వైద్యులు), డాక్టర్ రేఖా (శాస్త్రవేత్త) , ఎం నివేదా (డైటీషియన్), ఎన్ ఆర్ సి సిబ్బంది, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ధర్నా

ఎస్పి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : పాత్రికేయులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పి కార్యాలయం వద్ద జర్నలిస్టులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన విలేకరులపై మోహన్ బాబు, అతని బౌన్సర్లు దాడి చేసి గాయపరచడం శోచనీయమన్నారు. రంగంపేట వద్దనున్న విద్యానికేతన్‌లో జరిగిన దాడిలో గాయపడిన కెమెరామెన్ నరసింహులు పుర్రెభాగంలో తీవ్ర గాయం అయిందని, అతనికి న్యాయం చేయాలని కోరారు. సినీ నటుడు మోహన్ బాబు అతను అనుచరులపై హత్యాయత్నం, నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు, జర్నలిస్టులు తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషా ఉత్సవ్ వేడుకలు

పద్మావతీ వర్సిలో భారతీయ భాషా ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ప్రముఖ కవి, పాత్రికేయుడు, సంఘ సంస్కర్త మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకుని బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ నిర్వహించారు. భారతీయ సాహిత్యానికి భారతి చేసిన ఎనలేని సేవలకు , స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన కృషికి ఈ కార్యక్రమం ద్వారా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టుకోడానికి, భారతీయ భాషలను రక్షించడం, ప్రోత్సహించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అద్దంకి ప్రభుత్వ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టరు గాలి గుణశేఖరన్ మాట్లాడుతూ తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సుబ్రహ్మణ్య భారతి ఆశయ స్ఫూర్తిని కొనియాడారు. తమిళ సాహిత్యానికి భారతి చేసిన కృషిని, మహిళా సాధికారత, జాతీయ ఐక్యతను నొక్కిచెప్పారు. భారతి బహుభాషా సాహిత్య మేధావి, ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శకుడిగా అతని పాత్రపై ప్రొఫెసర్ జి శంకర్ నారాయణన్ ప్రత్యేక ప్రసంగం చేశారు. సమకాలీన భారతదేశంలో భారతి ఆదర్శాల ఔచిత్యాన్ని కూడా ప్రొఫెసర్ నారాయణన్ నొక్కి చెప్పారు. భారతి వారసత్వ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడానికి, భారతీయ భాషల వైవిధ్యాన్ని స్వీకరించడానికి, నిర్వహించడానికి యువ మనస్సులను ప్రేరేపణకు ఈ కార్యక్రమం ఒక వేదికగా ఉపయోగపడిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.ఎస్.దక్షిణామూర్తి, ప్రొ.జి.శంకర్ నారాయణన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా వేడుకను ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మాతృభాషను సంరక్షించడం, భావితరాలకు అందించడం భారతదేశం వివిధ భాషలను పరిరక్షించడం అన్నారు. ఇందులో భాగంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు సంప్రదాయపు దుస్తులు ధరించి తెలుగు సంస్కృతిని చాటారు. తెలుగు భాష, భారతదేశ వివిధ భాషలకు సంబంధించిన వస్త్రధారణతో సంగీత, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజనీ మాట్లాడుతూ ఆంగ్ల విద్య ఉద్యోగం కోసం మాత్రమే అని, మాతృభాష మన జీవితం, సంస్కృతి అని తెలిపారు. చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి జన్మదిన సందర్భంగా ఈ భారతీయ భాషా వేడుకను జరుపుకునే విధంగా గవర్నమెంట్ నిర్ణయించిన సందర్భంగా ఈ వేడుకను జరుపుకున్నామన్నారు. ప్రపంచంలో భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయ, సమైక్య సమ్మేళనం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్, స్టూడెంట్ అఫైర్స్, ప్రొఫెసర్ జె.కాత్యాయని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్వియూలో

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యలయంలో భారతీయ భాష ఉత్సవం – 2024 నూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించారు. వర్శిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, కులసచివులు ఆచార్య మాదాల భూపతి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య అప్పారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బహుభాష కోవిదుడు కావాలని కోరారు. మరో అతిథి ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ ప్రతి తెలుగువాడు తెలుగును అభిమానించాలని, తెలుగు భాషతోపాటు ఇతర భాషల్లో కూడా ప్రవేశం కలిగి ఉండాలి అని కోరారు. ఆర్ట్స్ కళాశాల డీన్ ఆచార్య మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ భాషల, సంస్కృతుల పట్ల గౌరవభావంతో, సహృద భావంతో మెలగాలని కోరారు. తథనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు వయోలిన్, వాయిద్య పరికరాల వినియోగం, భరతనాట్యం, కూచిపూడి నృత్యం తదితర కార్యక్రమాలతో అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య గణేష్ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ, పరిశోధకులు రాగాల ఆనంద గౌడ్, ప్రసన్న కుమార్, రూపేష్, వర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్వియూ విసి ఆచార్య అప్పారావు

గ్రామ పంచాయతీలు బలోపేతం: ఎమ్మెల్యే

ట్రాక్టర్లు పంపిణీ చేసి వాటిని నడుపుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : గ్రామ పంచాయతీలకు పంపిణీ చేస్తున్న ట్రాక్టర్లను పారిశుధ్యంతో పాటూ, తాగునీటి కొరత సమస్య పరిష్కారానికి వినియోగించుకుని గ్రామ పంచా యతీలను అన్ని విధాలా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే భానుప్రకాష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నా రు. పుత్తూరు మండలం కేబిఆర్ పురం, తడుకు గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ, పారిశుధ్య అవసరాల నిమిత్తం , గ్రామ పంచాయతీ అవసరాల నిమిత్తం రెండు ట్రాక్టర్లను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ నిధులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 6,01,961 రూపాయల వ్యయంతో మస్సీ ఫెర్గుసన్ 1035 డిఐ, తడుకు గ్రామ పంచాయతీకి ఈచర్ 333 (ఇచైర్ 333) కంపెనీ ట్రాక్టర్ 6,01,961 వ్యయంతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కేబిఆర్‌పురం గ్రామ సచివాలయం వద్ద నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అందించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ నిధులతో వచ్చిన ట్రాక్టర్‌లను గ్రామంలో పరిశుభ్రతకు, ఎక్కడైనా మంచినీటి కొరత ఏర్పడితే ఈ ట్రాక్టర్‌లను మంచినీటి ట్యాంకర్‌లా ఉపయోగించుకుని గ్రామ పంచాయతీలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చేయాలని, ప్రభుత్వం ఇంకా గ్రామపంచాయతీలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రంలో గ్రామ నాయకులు, కేబిఆర్‌పురం గ్రామ సర్పంచ్ టి జానకి , తడుకు సర్పంచ్ పి వెంకటేష్ , వైస్ ఎంపీపీ పి విమలమ్మ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య , ఎంపీడీవో కె రమేష్ బాబు, యుపిఆర్‌డి బి దేవిక, పంచాయతీ కార్యదర్శులు కె అనిల్ కుమార్, పి నరేష్, సచివాలయం సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణాలు వేగవంతం

సిసి రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలోని విజయ కాలనీలో ఐదు లక్షల రూపాయల నిధులతో నిర్వహించిన సీసీ రోడ్డును స్థానిక టిడిపి సీనియర్ నాయకులు పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి, కోట మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ బాషలు బుధవారం పరిశీలించారు. పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, కోట మండలం మైనార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ బాష మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గూడలి పంచాయతీలో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తా మన్నారు. అందులో భాగం గానే విజయ కాలనీలో మరెన్నో సంవత్సరాల నుండి సిమెంట్ రోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో టిడిపి ప్రభుత్వంలో సిసి రోడ్డును నిర్మించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయా రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ ఏఈ కిరణ్ పని తీరును క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ కిరణ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం లో ఎలాంటి అవకతవకలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తన్నమాల కోటారెడ్డి, కందల బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ఎస్వియూలో ఓఆర్ఐ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న విసి ఆచార్య అప్పారావు

ఎస్వియూలో ఓఆర్ఐ జర్నల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురి స్తున్న అంతర్జాతీయ జర్నల్‌ను విశ్వ విద్యా లయ ఉప కులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రారు ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు కలిసి బుధవారం ఆవిష్కరిం చా రు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విశ్వవిద్యాల యానికి తలమానికంగా వున్న ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)మన ప్రాచీన వారసత్వ సంపదగా వున్న తాళపత్ర గ్రంథాల సంరక్షణకు నిరంతరం శ్రమిస్తోందని ఎన్నో అపురూపమైన గ్రంథాలు ముద్రిస్తోందని, ఇప్పుడు జర్నల్ 64 వ వాల్యూం ప్రచురించిందన్నారు. ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురించే జర్నల్లో సంస్కృతం, తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసాలు వుండడం ప్రత్యేకతని, ఈ జర్నల్ దాదాపు 40 దేశాలకు ఎక్స్ఛేంజ్ రూపంలో వెళుతుందని, తిరుమల తిరుపతి దేవస్థాన వారి సహకారంతో సంస్థను మరింతగా అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ పరిశోధన సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, నాన్ టీచింగ్ కార్యవర్గం పి కె సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ ప్రసాదాలు అందిస్తున్న కార్య నిర్వహణ అధికారి ప్రసన్నలక్ష్మి

చెంగాలమ్మ సేవలో సతీష్ రెడ్డి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వైజర్ జి.సతీష్ రెడ్డి సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయాన్ని బుధవారం దర్శించుకొన్నారు. వారిని సహాయ కమిషనరు, కార్యనిర్వాహణాధికారి బి ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం వేద పండితులచే అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం స్వీకరించారు.

రైతులు ఈ క్రాప్ చేయించువాలి: ఏవో

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండలంలోని రైతులందరూ వరి, ఇతర పంటలను ఈ క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియంను చేయించుకుని పంట నష్టపోయిన సమయంలో ఫసల బీమా పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిర్మయి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి రైతులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీ 2024– 25 సంవత్సరానికి ఇన్సూరెన్స్ ప్రీమియం వరికి రూ.630, వేరుశనగకి రూ.450 చెల్లించాలని, తిరుపతి జిల్లాకు వరి పంట విలేజ్ యూనిట్‌గా, వేరుశనగ మండల్ యూనిట్ గా నోటిఫైడ్ పంటలుగా ప్రకటించారన్నారు. దొరవారి సత్రం మండలంలో ఎక్కువ వరి పంట ఉన్న కారణంగా రైతులు ఈ క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించి పంట నష్ట సమయంలో ఫసల్ బీమా పొందేందుకు అర్హత పొందాలన్నారు. వరి పంటకు ప్రీమియం డిసెంబర్ 31, 2024లోపు, వేరుశనగకకు డిసెంబర్ 15, 2024లోపు ఈ ఫసల్ బీమా లో ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఆర్ఎస్‌కె స్టాఫ్‌ను కలిసి ఈ –పంట నమోదు చేసుకుని ధృవీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్‌తో పాటు పొలా నికి సంబంధించి పాస్‌బుక్, సర్వే నెంబర్ ఉన్న అగ్రిమెంటు ఆధార్ జెరాక్స్, బ్యాంక్ పాసుబుక్ తీసుకుని సిఎస్‌సి సెంటర్‌ను సంప్రదించి ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు 2024 సంవత్సరం అక్టోబర్ నుంచి క్రాప్‌లోను తీసుకుని ఉంటే బ్యాంకులో కూడా ప్రీమియం చెల్లించవచ్చని బ్యాంకు లోన్ ద్వారా ప్రీమియం చెల్లిస్తే ఇన్సూరెన్స్ క్లెయిమైనప్పుడు ఇన్సూరెన్స్ నగదు లోన్ అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. కౌలు రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలంటే విఆర్ఓను కలిసి కౌలు రైతు సర్టిఫికెట్‌ను తీసుకుని ఈ –పంటలో నమోదై పంట ధృవీకరణ పత్రం తీసుకుని, ఆధార్, బ్యాంకు పాసుబుక్ తీసుకుని సిఎస్‌సి సెంటర్‌కు వెళ్లాలని సూచించారు.

దళిత ప్రొఫెసర్ చంగయ్యపై దాడి అమానుషం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సి టీ దళిత ప్రొఫెసర్ చంగయ్యపై దాడి అమాను షం అని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని కోరుతూ పుత్తూ రు అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం కార్యదర్శి అపరంజి. కార్యదర్శి కుప్పయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనం నుంచి బుధవారం సాయంత్రం పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు పుణ్యమూర్తి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఉన్నత హోదాలో ఉన్న దళిత ప్రొఫెసర్ చంగయ్యపై మత ప్రచారం చేశాడని తప్పుడు అభియోగాన్ని మోపి భౌతికంగా దాడి చేయడం అమానుష చర్య అని దాడికి పాల్పడిన భజరంగ్‌దళ్ కార్యకర్తను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నడూ లేని విధంగా మత సామరస్యానికి ప్రతీకగా ఉండే తిరుపతిలో మత చిచ్చు పెట్టడం మంచి పద్ధతి కాదని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ప్రొఫెసర్ తప్పు చేసి ఉంటే యూనివర్సిటీ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ తన ఛాంబర్ లోకి వెళ్లి బలవంతంగా ఈడ్చుకుంటూ బూతులు తిడుతూ భౌతికంగా దాడి చేయడం మంచి పద్ధతి కాదని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వ అధికారులు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో భవిష్యత్ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ భవనం కోశాధికారి కుప్పయ్య, డాక్టర్ రాజేంద్ర. కే విజయ్ కుమార్, డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం, మావిళ్లయ్య, మహేష్, డాక్టర్ గుణశేఖర్, మూర్తి, దశరథం, మహేష్, ధన, బుజ్జి బాబు, నాగూర్, ప్రభాకర్, శేఖర్, వెంకటేష్ నటేషన్, వడివేలు, పాల్గొన్నారు.

కబ్జాల నుండి రక్షించండి..

రెవెన్యూ సదస్సులో ప్రజల ఫిర్యాదు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని కొటాల గ్రామంలోని శ్మశానం, చెరువు సాగునీటి కాలువలు కబ్జా నుండి కాపాడాలని, జగనన్న కాలనీలో అక్రమాలపై విచారణ చేసి రక్షణ కల్పించాలని గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో తహశీల్దారు శివరాం సుబ్బయ్యకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం కొట్టాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు శివరాం సుబ్బయ్య మాట్లాడుతూ రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక ఈ రెవెన్యూ సదస్సులని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యలపై ప్రజలు అధికారులు చుట్టూ తిరగాల్సిన పని లేదని అధికారులే ప్రజలకు వద్దకు వచ్చి వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కొటాలలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని, గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో అక్రమాలు చోటుచేసు కుంటున్నాయని, కొటాల చెరువుకున్న అనుబంధ కాలువలు కబ్జాలకు గురయ్యాయని మాజీ సర్పంచ్ సుధా, మల్లిక, రాజేంద్ర,హేమ శేఖర్, గ్రామస్తులు కలిసి తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో భూ సమస్యలపై 33 ఫిర్యాదులు వచ్చాయని తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో

దొరవారిసత్రం : గ్రామ స్థాయిలో భూ సమస్యలు తక్షణమే పరిష్క రించే వేదిక రెవెన్యూ సదస్సు అంటూ దొరవారిసత్రం మండల రెవెన్యూ సదస్సు స్పెషల్ ఆఫీసర్ ఓ శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం తహశీల్దారు శైలకుమారి మాట్లాడుతూ మ్యుటేషన్, భూసర్వేకు సంబంధించి పలు అర్జీలు రెవెన్యూ సదస్సులో వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఐ మోదుగుల ప్రవీణ్ రాయల్, వీఆర్వో యుగంధర్, సర్వేయర్ నాగరాజు, రవీంద్ర నాయుడు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, పలుశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గోవిందపాలెం రెవెన్యూ సదస్సును కామరాజనగర్ లోని బలిజ సంఘం భవనంలో పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లు సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులను కలిసి భూములకు సంబంధించిన సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్, పుత్తూరు మున్సిపాల్టీ10వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి డిజి ధనపాల్, 10వ వార్డు టిడిపి ప్రసిడెంట్ ముడిపల్లి రూపేంద్ర, నగరి నియోజకవర్గం బీసీ సెల్ సెక్రటరీ డి శ్రీనివాసులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న తహశీల్దారు వెంకటేశ్వర్లు

కోట : గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దారు కే జేజే రావు అన్నారు. బుధవారం కోట మండలంలోని ఊనుగుంటపాలెం పంచాయతీ పరిధిలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. తహశీల్దారు కే జేజే రావు మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వేతో భూముల కొలతలు తారుమారు కావడం, ఆన్‌లైన్‌లో భూములు ఎక్కువ, తక్కువ నమోదు కావడం వంటి సమస్యల పరిష్కారానికి సదస్సులో అర్జీలు ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. అనంతరం మ్యుటేషన్, చుక్కల భూములు,పేర్లు మార్పులు, చేర్పుల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు పఠాన్ అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ మధులత, ఎంపీపీ దాసరి అంజమ్మ, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఎండోమెంట్ అధికారి, పంచాయతీ కార్యదర్శి వీఆర్వో, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలో వికృతమాలలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పూల హేమక్షి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు. ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ రేణిగుంట విమానాశ్రయ విస్తరణ పనుల కోసం గతంలో దాదాపు 52 మంది రైతులు భూములు ఇచ్చామని ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదని త్వరితగతిన అందేలా కృషి చేయాలని గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఈఎంసికి 18 మంది రైతులు తమ భూములు ఇవ్వక వాటికి కూడా పరిహారం అందలేదని రైతులు విన్నవించారు. దీంతో పాటు ఇటీవల వేసిన జగనన్న లేఅవుట్లలో వికృతమాల ప్రభుత్వ అవసరాల కోసం ఉంచుకున్న భూమిని 82 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని వైసీపీ నాయకుల పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహశీల్దారు భార్గవికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ రెవెన్యూ సదస్సులో అత్యధికంగా 27 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇంటి స్థలాల కోసం 12, అసైన్మెంట్ గవర్నమెంట్ ల్యాండ్‌కు 4, రికార్డ్స్ ఆఫ్ రైట్స్ కు11 అందాయని తహశీల్దారు భార్గవి తెలిపారు. ఈ సదస్సులో టిడిపి సీనియర్ నాయకులు పేరం ధనంజయ నాయుడు, సీఐ జయచంద్ర, డిప్యూటీ తహశీల్దారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోనాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

IN THE COURT OF THE Prl., SENIOR CIVIL JUDGE COURT OF TIRUPATI
H.M.O.P.No. 67/2024

Between:
D. Hima Bindu ... **Petitioner**
And:
D. Avinash ...**Respondent**

To:
D.Avinash S/o D. Mohan, D.NO:6-26, Police station street, Pakala (V & M), Chittoor District

NOTICE

Please take notice that the petitioner has filed the above petition against you and it is posted to 16-12-2024 for your appearance before this Hon'ble court. If you got any objection to allow the above petition you can appear before the above Hon'ble court at 10.30 am on 16-12-2024 either in person or through your advocate and file your objection if any. If you fail to appear before the above Hon'ble court on the above date the above petition will be decided exparte.

Hearing date: 16-12-2024 at 10.30am.
B. USHA KIRAN BA, B.L
Advocate: Tirupati